# ఆటం కాఫీ

పొద్దు పొడిచింది.

చిన్న ఉపాధ్యాయుడు కాఫీకి పాలు తేవటానికి ఊళ్ళోకి వెళ్ళాడు!

మన్నెంలో పాలు పెందరాడే దొరకవు. అదొక దురవస్థ. ఏ పదింటికోగాని మాడలను వదలరు. విశ్వప్రయత్నం చేస్తేనేకాని కాస్త పెందరాడే లభించవు. డిప్టీఇనస్పెక్టరు వస్తున్నాడనగానే మేష్టర్లు ముందు ఏర్పాటు చేసుకోవాలి పాపం! వాళ్ళ కదొక పరీక్ష.

ఇనస్పెక్టరు నందకిశోరరావు కుర్చీమీద కూర్చున్నాడు. పొడుగుపాటి బల్లదగ్గరికి లాగుకొని అతని స్నేహితుడు సింహాద్రిరావు కూర్చున్నాడు. వాళ్ళ ధ్యానం అప్రయత్నంగా కాఫీమీదికి పోతూంది.

సింహాద్రిరావు ఇనస్పెక్టరుతో "బావగారూ! ఈ రోజున చిత్రమైన కాఫీదొరగారు తయారు చేస్తారుట!" అన్నాడు.

"చిత్రమైన కాఫీ అంటే?" అని అడిగేడు నందకిశోరరావు.

"ఆ రహస్యం ముందే బయలుపెడతానా, నేను ఎంత డిగ్రీలు సంపాదించని వాణ్ణయినా! కాస్తో కూస్తో రాజకీయవేత్తను కదా!........కాఫీ తయారు చెయ్యడం అందరికి చేతకాదు మరి! అదొక రహస్యమైన యోగం స్వర్ణయోగంలాగు ఈ కాలపు యువకుల శక్తి సామర్థ్యాలకి అదొక నిశితపరీక్ష. మనిషియొక్క అసలైన తెలివితేటలు దానిలోనే బైట పడు

తుంటాయి. హోటేలుకు వెళ్ళి ఫలహారం చేసివైటికివచ్చి "అబ్బే! కాఫీ ఏమీ బాగలేదంటే నమ్ము' అని కసి. ముక్కు. పెదవులు. చేతులు ఆడించి. భావప్రకటన చేసి. "నిన్న పొద్దున్న ఐదున్నర గంటలప్పుడు ఎంతబాగా తయారుచేశాడనుకున్నావ్! ఆహాహా! ఇవాళ గలబెట్టేశాడంటే నమ్ము!" అనాలి! మిగత పదార్థాలు ఎన్ని తిన్నాసరే వాటిజోలికి పోకూడదు. కాఫీయే హోటేలుకి ముఖ్యమైన లక్ష్యం. అయితే నేను తయారు చేసే కాఫీ అందరూ తయారుచేసేదానిలాగు ఉంటుందనుకొంటున్నావేమో? అబ్బే! లోకంలో శాస్త్రజ్ఞులు ఆటంబాంబు. ఆటం ఎనర్జీ (అంటే: అణుశక్తి) కనిపెడితే నేను ఎటామిక్ టేస్టు (అంటేఅణురుచి). ఎటమ్ కాఫీ (అంటే అణుకాఫీ) కనిపెట్టాను" అని సింహాద్రిరావు గర్వంగా కనపడ్డాడు.

ఇనస్పెక్టరు "ఇదేమిటయ్యోయ్! ఇవాళ క్రొత్త కొత్త పదాలు దొర్లిస్తున్నావు. మొదటిలో మొయ్యలేక చస్తాం" అని విస్మయపడ్డాడు!

"పాపం! ఇందాక కష్టపడి అడిగేవు. కాబట్టి కాఫీ చేసే విధానం ఒక పిసరు నీకు మాత్రమే తెలియజేస్తాను. ఒక కప్పు కాఫీ తయారు చేసేటప్పటికి సరిగా ఒక గంటసేపు పడుతుంది. కాఫి గుండమీద మరుగుతూన్న నీళ్ళుపోసిన తర్వాత కప్పులో చెంచా అలాగు తిరుగుతూనే ఉండాలి! ఒక్కక్షణం ఆగడానికి వీలులేదు. ఒక్క పాలచుక్కపొయ్యడం దానితో ఒక్కరవ్వ పంచదార వెయ్యడం. కలియపెడుతూండడం. ఇవి మూడూ మూడు ప్రత్యేకపు పనులు. ఇలాగ కలియపెట్టగా, కలియపెట్టగా-గూడు పడిపోయినా సరే, లక్ష్య పెట్టకూడదు. మరి_అలాగు శ్రమపడగా, పడగా ఒక కప్పు ఆటంకాఫి తయారవుతుంది. అని సింహాద్రిరావు మహాఘనుడిలాగు కనబడ్డాడు.

నందకిశోరరావు "చాల విచిత్రంగానే ఉంది!"అని. "ఒక్క నువ్వే కాదు. ఈకాలపు యువకులందరికీ స్పెషల్ కాఫి అంటే ప్రాణమే! దాని కోసం చెవులుగాక, నాలుకలుతెగకోసుకొంటారు" అన్నాడు.

"ఇంతకీ నేను చెప్పవచ్చిందేమిటంటే-ఇవాళ ఆటం కాఫిచేసి నీకు రుచి చూపిస్తాను" అన్నాడు సింహాద్రిరావు.

"దానికేంలే, అలాగే చెయ్యి. నేను వద్దనలేదుగా! నీ ఉత్సాహం భంగంచేసి పాపం మూటకట్టుకొనే రకంకాదు" అన్నాడు ఇనస్పెక్టరు.

"అంతవరకు నువ్వు మరేమీ పుచ్చుకోవద్దయ్యోయి!" అన్నాడు సింహాద్రిరావు.

"ఇహ ఆ మాటలు కట్టిపెట్టు: ఏదో ఇంత కడుపులో పోసుకొన్నాక, నువ్వు ఎన్నిసార్లు తెచ్చినాసరే అలాగు నింపుతూనే వుంటాను పానకాలనరసింహస్వామిలాగు" అన్నాడు ఇనస్పెక్టరు.

ఉపాధ్యాయులు ఇంటదగ్గిరనుంచి ఒక ఇత్తడిచెంబుతో కాఫితేగా, ఇనస్పెక్టరు ఇత్తడిగ్లాసులో వంచుకొని ఇత్తడివాసన. ఇత్తడిరుచిఅనుభవిస్తూ పుచ్చుకొన్నాడు. ఇనస్పెక్టరు సింహాద్రిరావుకి మరొక గ్లాసులో పోసి అందియ్యబోగా "నహి నహి!" అంటూ అతను ఆటం కాఫి తయారుచెయ్యడానికి లేచాడు. ఇనస్పెక్టరు బడి పని చూసుకోడానికి వెళ్ళాడు.

సింహాద్రిరావు పొయ్యి అంటించి గిన్నెతో నీళ్ళు పడవేశాడు. చితుకులను ఎగసన తొయ్యటంతో. ఊదడంతో కాలక్షేపమయింది. ఉడుకునీళ్లు కాఫి గుండమీద పోసి తేర్చేడు. వాటిలో పాలచుక్క-పోస్తూ. పంచదార పిసరువేస్తూ చెంచాతో గిలకొట్టడం ప్రారంభించేడు. గిలకొట్టి గిలకొట్టి చేతులు నొప్పులు పెడుతూండగా "ఇంక చాలు పరమేశ్వరా!" అని కొంత ఒక కప్పులోకి వంచేడు. "ఇంత శ్రమపడితే బాగుండ కేమి చేస్తుంది." అనుకొంటూ. లోపలికి పుచ్చుకొని తృప్తిపడ్డాడు: ఇనస్పెక్టరు కోసమని కప్పులో పోసుకొని. తీసుకువెళ్ళి ఎదుట పెట్టేడు. మేష్టర్లని నోళ్లుపట్టమని తలోచుక్కా తానే పోశాడు. పోసనచుక్క-నాలుకకేనా అంటకపోగా వాళ్ళుఏమీ అనలేక ఊరుకొన్నారు.

ఇనస్పెక్టరు కప్పులో పదారం కొంత పిల్చి "ఏమి టయ్యోయ్! పళ్ళు జివ్వుమనిపోతున్నాయి." అన్నాడు.

ఇందులోనే ఐస్డ్ కాఫీ (మంచుగడ్డ కాఫీ) కూడ కలిసిపోయిందన్నమాట? చెన్నపట్టణం హోటేళ్ళలో ఉడుకుడుకు కాఫీ గళాసులో మంచునడ్డవేసి. మేజా బల్లమీద పెట్టగా పీత్వావ్యక్తి ఆ గడ్డ కరిగేదాకా చంచాతో గిలగిలకొట్టుకొంటాడు. నీకు అవన్నీ ఒక్క దెబ్బలోనే వచ్చేశాయన్నమాట? మాటలకేంగాని అసలుసంగతి చెప్పేవుకాదు" అన్నాడు సింహాద్రిరావు.

"నోట్లో పోసుకొంటేనే పళ్ళు జివ్వుమనిపోతూంటే, ఇంక రుచేమిటి నీ మొహం." అన్నాడు నందకిశోరరావు!

"నీకు కొన్నాళ్ళు అభ్యాసమయితేగాని చల్దిగంజి రుచిలాగు తెలియదులే!" అన్నాడు సింహాద్రిరావు.

"నీ కాఫీ వంటింటిలోంచి ఇవతల పడేటప్పటికి అవతలి మనిషి ఆకలిప్రాణంకూడా తీరిపోతాయని" హేళనచేశాడు ఇనస్పెక్టరు.

"లోకంలో శాంతం దేనికి అక్కరలేదో చెప్పునాయనా! పెద్ద పెద్ద యుద్ధాలనే శాంతి సమరాలు అంటూంటే, ఇహ కొంపలలోనా అశాంతి! అందుచేత ప్రతిదానికి కనిపెట్టుకు తూర్చోనడం అతి ముఖ్యం. ఓర్పుకి, కనిపెట్టుకు కూర్చోడానికి సంబంధముంది. ఓర్పులేనివాడు కనిపెట్టుకు కూర్చోలేడు. ఓర్పు ఉన్నవాడు ఒకటోరకంగా కనిపెట్టుకొని ఉండగలడు. వెనక ఒక తెలుగు వ్యాసకర్త దానిని గురించి వ్యాసంకూడా రాశాడు. ఇంతకీ నాకు కొత్త సంగతికాదు. లోకంలో కనిపెట్టుకు కూర్చుంటే కాని ఏ పని అవుతుంది చెప్పు! చూడు, ఒక్క బస్సు రైలు, రేషన్‌షాపు, పోస్టాపీసు తాలూకాకచ్చేరీ. నీటికొళాయి. వీటి అన్నిటి దగ్గర "క్యూ"గ నిలబడవలసిందే కదా. ఏదేనా దేశవాళీ కంపెనీకి పనిమీద వెళితే అక్కడ పడిగాపులు పడుండవలసిందే కదా? యూరోపియన్ కంపెనీ సంగతి చెప్పకులే? మనవాళ్లు ఎంతసేపు కూర్చోబెడితే అంతగౌరవం తనకు దక్కినట్లుగా భావిస్తారు. నాయనా? ఇంతకు ఎదుకు? ఓక పులి జంతువుమీద పడి అదునుకోసం ఎంతసేపు పొంచి వుంటుందో తెలుసా! అదే తెలివైన జంతువయితే ఈ లోపలే ఉడా

యించవచ్చు. మానవలోకంలో ఇంకా పోనుపోను—అంటే త్వరకోసం వడికోసం భౌతిక శాస్త్రం. యంత్రసామగ్రి ఒకమూల అభివృద్ధి అవుతూంటే, మరొకమూల కనిపెట్టుకోడాలు. వెయిటింగు రూములు. వెయిటింగు మేడలుకూడ అభివృద్ధవుతూంటాయి. కనిపెట్టుకోడం ఒక కళ అని పుస్తకాలు బయలుదేరుతాయి కూడా! ప్రకృతిలోని వాక్యం అది. అలాగు వృద్ధయిపోయి ఆఖరికి ఆకాశానికి సాటి అయిపోతుంది. అంత ఆకాశమందన్న మాటేగాని అందులో చేతికి దొరికే గుప్పెడు పదార్థమేదేనా ఉందా చెప్పు!" అన్నాడు సింహాద్రిరావు బోరవిరిచి.

"మాటలు బాఫీలాగున్నాయి. కాని నువ్వింత తాగేవాలేదా చెప్పు మొదట" అని అడిగేడు నందకిశోరరావు.

"ఇదేమి ఆడవాళ్ల వంట అనుకొన్నావుటయ్యా. అందరికీ వండి గుమ్మరించి ఆఖరికి మిగిలిన అడుగుబొడుగు. మాడు పెచ్చులు రాళ్ళు రప్పలు చింతపండు ఉట్టెలు పోపుగింజలముద్ద వడ్డించుకొని తినడానికి. ఆడది వంట ఎలాగు చెయ్యాలో తెలుసా! వండిన పదారం ఏలాగుందో. ఉప్పే తక్కువైందో పప్పే తక్కువలుంతో! ఇది భర్తగారికి ఇష్టంగానే ఉంటుందో అయిష్టంగానే ఉంటుందో ఏది లోపమో తెలుసుకోడానికి మొట్టమొదటే తను ఇంత రుచి చూడాలి. పిండివంటలు చేసేటప్పుడైనా సరే, ఆఖరికి ఫలహారం చేసేటప్పుడైనాసరే మొదటివాయ నోటిలో వేసుకొని చూడాలి. తక్కినది ఎంత ఉంటే అంత అందులో తనకి వాటా వేరే అట్టే పెట్టుకొని భర్తగారికి భక్తితో వడ్డించాలి. అటువంటి మహా ఇల్లాలు చరిత్రలో ఒకత్తై కనబడుతూంది. ఎంత వెతికిచూసినా, కాకరకాయ కూర వండి మొగుడికి పెట్టిన మహాప్రతివ్రత కథ ఎరగవుటయ్యా! ఆమహా ఇల్లాలికి సాటిఎవరయ్యా భూమిమీద! పతివ్రతా శిరోమణిఅన్నా, నారీరత్నం అన్నా ఆవిడే. అందుచేత ఆడది రుచికోసం మొట్టమొదట ఇంత వడ్డించుకొని తినాలి అందులో ఏదైనా లోపం ఉండే సర్దడానికి వీలు లేకపోతే, అదంతా వీధిలో పారపోసి, మళ్ళా వంటచేసపెట్టి, మొగుడి ప్రేమ, గౌరవం చూరగొనాలి" అన్నాడు సింహాద్రిరావు.

"అబ్బే! అంత తెలివి తేటలెక్కడ?" అన్నాడు ఇనస్పెక్టరు.

"అలాగు తెలివితేటలు సంచరిస్తే వి సరిసగిర ఈ మొహం మాడ్చుకోడాలు. ఈ అంబోతురంకెలు, ఈ కుస్తీపట్లు. ఈ కుమ్ములాటలు ఈ కూనిరాగాలు యెందుకు వస్తాయయ్యా" అన్నాడు సింహాద్రిరావు.

"ఇదీ కొత్తపద్ధతే" అని నందకిశోరరావు కనుబొమ్మలు ఎగరవేశాడు.

"ఇటువంటి కొత్తవి చెప్పితే మనవాళ్ళ బుర్రలకి ఎక్కవు. ఎంత సేపు పాతపుంతలే పట్టుకొని పాకులాడతామంటారు. కొన్నిటిలో సనాతనధర్మం పనికిరాదయ్యా" అన్నాడు సింహాద్రిరావు.

కాఫీ బొత్తిగా చల్లగావుండగా ఇనస్పెక్టరు తాగలేక. "పొయ్యిమీద కాస్త వెచ్చపెట్టి తీసుకరమ్మ"ని చిన్న మేష్టరిని పంపించేడు.

"అబ్బెబ్బే! కాఫీ వెచ్చపెట్టకూడదయ్యోయి! ఒకమారు తయారు చేసిన కాఫీ మళ్ళా పొయ్యిమీద పెడితే విషమైపోతుందంటారు కొందరు జ్ఞానులు. దాని ఘుమ ఘుమ_అంటే సువాసనపోయి. వట్టి కషాయం మిగులుతుందన్న విషయం ఆత్మానుభవం" అన్నాడు సింహాద్రిరావు.

"సువాసన పోయినాసరే. రంగు పోయినాసరే. చివరికి విటమిన్లు పోయినాసరే. చప్పగా చల్లారిపోయిన కాఫీ నా నోటికెక్కదు" అన్నాడు నందకిశోరరావు.

ఇనస్పెక్టరు ఈ కాలపు పాషన్లు తెలియని చదువుకొన్న అజ్ఞాని అని సింహాద్రిరావు భావించుకొన్నాడు.

చిన్నమేష్టరు వెచ్చబెట్టి తెచ్చి ఇయ్యగా ఇనస్పెక్టరు కాఫీ పుచ్చుకున్నాడు. అతను ఉపాధ్యాయులతో "రేపు ఆదివారం కనక రేపు మధ్యాహ్నం దాకా ఇక్కడే మకాం. ఏదో రికార్డుపని చూసుకోవలసుంది" అన్నాడు.

ఆ మాటలు సింహాద్రిరావు గమనించాడు.

కథా నిలయం
6018

ఇనస్పెక్టరు బడిపని చూడ్డానికి కదిలేడు. అతనివెంట ప్రధానోపాధ్యాయుడు వెళ్ళాడు. రెండో మేష్టరు అక్కడే నిల్చున్నాడు. బంట్రోతు వచ్చి అక్కడి కుర్చీని ఇనస్పెక్టరు కోసం తీసుకుపోయేడు. సింహాద్రిరావు రెండో ఉపాధ్యాయుణ్ని తనతో రమ్మని సైగచేశాడు. ఇద్దరూ వెళ్ళి పాకలో ఒకమూల తాటాకులచాప వేసుకు కూర్చున్నారు.

"ఏమిరా! అబ్బాయీ! కాఫీ ఎలాగుంది?" అన్నాడు సింహాద్రిరావు.

"దానికేముందండి అయ్యగారూ! జుంటితేనెలాగుందండి!" అన్నాడు ఉపాధ్యాయుడు.

"ఇంకా బాగుండేది. కానిపాలు పల్చనైపోయేయి. మంచికాఫీ అని మనవాళ్ళు అంటే అర్థమేమిటో తెలుసా? మంచి పాలనే అర్థం. పాలు, పంచదార విడిచిపెట్టి ఒట్టికాఫీ నోటిలో పోసిచూడు. గొంతుక దిగుతుందేమో!" అన్నాడు సింహాద్రిరావు.

"అబ్బెబ్బే! ఏమి రుచండీ! రామ! రామ! చేదు విషం" అన్నాడు పంతులు.

"ఇంతకీ కాఫీ డికాక్షన్ అని పెద్దపేరు పెడతారు మనవాళ్ళు. ఇంతా చేస్తే డికాక్షన్ అర్థమేమిటో తెలుసా? కషాయం అన్నమాట. మన వాముకషాయం, నేల వేముకషాయం లేవూ? మన ఆయుర్వేదానికి తెలియనిదేముందిచెప్పండీ! తేయాకు మనదేశంలో క్రీస్తు పూర్వమే వాడుకలో ఉండేదన్న సంగతి మనవాళ్లు తవ్వి బైటికితీసేరు. చరకమంతా వెతికిచూస్తే ఏమూలో కాఫీని గురించి ఒకకారిక దొరక్కపోదు. పూర్వకాలపు వాళ్ళు దీనికేంపేరు పెట్టి పిలిచేవాళ్ళో మనకి తెలియదు కాని మూలగ్రంథాలైన వేదాలు తిరగవేస్తే పూర్తిగా దొరుకుతుంది. ఇంతకీ సోమరసం తెలిసిన వాళ్ళకి కాఫీ తెలియదంటే నవ్వు వస్తుంది. ఇప్పుడు కొత్తగా కనిపెట్టేమని మురిసిపోయే ఏరోప్లేనులు అంటే, వాయువిమానాలని గురించి మనవాళ్లు అప్పుడే రాసిపారేశారు పదితాటికమ్మల గ్రంథం" అన్నాడు సింహాద్రిరావు నాలుక వెళ్ళబెట్టి.

"అంతా నిజమేనండి!" అన్నాడు పంతులు. "ఊం" అంటే మట్టుకు ఇంతటిలో మన సొమ్మేమి పోయిందన్నట్టు.

చిన్నమేష్టరి క్లాసులో ప్యాసయినవారి సంఖ్యను గురించి పెద్ద సందేహం రాగా పెద్దమేష్టరు చిన్నమేష్టరు నొక కేకవేశాడు. అతను లేచి కంగారుపడుతూ పరుగెత్తికొని వెళ్ళాడు.

పనిలేని సింహాద్రిరావుని నిద్రాదేవి తీరుబాటుగా వరించింది.